



పరిగి చేపల మార్కెట్‌లో కోలాహలం, (ఇన్‌సెట్‌లో) వికారాబాద్ మార్కెట్‌లో చేపలను శుభ్రం చేస్తున్న దృశ్యం

సూపర్ మచ్చీ..

మృగశిర కార్తెతో వర్షాకాలం ప్రారంభమవుతోంది. ఈ రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని పెద్దలు చెబుతుంటారు. ఉబ్బసం, ఆయాసం ఉన్నవారు ఈ కార్తె మొదటి రోజున చేపలు తింటే మేలు చేస్తుంది. అయితే ఈ ఏడాది మృగశిర కార్తె ఆదివారం రావడంతో చేపలకు భారీగా డిమాండ్ పెరిగింది. మార్కెట్లు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే చేపల కొనుగోలుకు జనం ఎగబడ్డారు. గతంలో కంటే ఈ సారి చేపల ధరలు కొంత తక్కువగానే ఉన్నాయి. గతేడాది కొర్రమీను కిలో ధర రూ.700 ఉండగా, ఈ సారి రూ.600కు విక్రయించారు. బంగారు తీగ రూ.250, బొచ్చ రూ. 200, రవ్వ రూ. 200 చొప్పున విక్రయించారు. వీటితో పాటు నాటు కోడి ఒక్కటి రూ.600కు విక్రయించారు. మటన్ కిలో రూ.850, బోటి కిలో రూ.450కు విక్రయించారు.



సమాచారం

ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశాలు షురూ..



మేడ్చల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు ప్రభుత్వ ఐటీఐ అల్వాల్ ప్రిన్స్‌పాల్, కన్వీనర్ పి.శంకరయ్య తెలిపారు. అల్వాల్ ఐటీఐల్లో ఈ సంవత్సరం 13 విభాగాల్లో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వీటిలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, డ్రాఫ్ట్‌మాన్ సివిల్, వెల్డర్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ, సోలార్ టెక్నీషియన్ అండ్ ఎలక్ట్రికల్, మాన్యు ఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యు ఫార్యక్చరింగ్, ఆర్టిసన్ యూసింగ్ అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చ్యువల్ వెరిఫైర్(మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీ అండ్ సీ మ్యాచింగ్ టెక్నీషియన్, మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికల్ తదితర ట్రేడులు ఉన్నాయి. పదో తరగతి లేదా ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులు. అభ్యర్థులు ఐటీఐ.టీఈఎల్ఏఎన్‌జీఏఎన్ ఏ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మొదటి విడత దరఖాస్తుల గడువు జూన్ 2 నుంచి 21 వరకు ఉండనుంది. మరిన్ని వివరాలకు 9849188346, 8639343045, 8185846115 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్స్‌పాల్ కోరారు.

నేడు జిల్లాలో..

పదో తరగతి టాపర్లకు సన్మానం

బొంరాస్‌పేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో మండల స్థాయిలో టాపర్స్‌గా నిలిచిన 16 మంది విద్యార్థులను సోమవారం సన్మానించనున్నట్లు ఎంఈవో హరిలాల్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేజీబీవీ చెట్టుపల్లితండా, జెడ్పీహెచ్ఎస్ చౌదర్‌పల్లి, బొట్లవని తండా ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రేగడిమైలారం, బొంరాస్‌పేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులను సోమవారం బడిబాట కార్యక్రమంలో సన్మానించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ



కొడంగల్ రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, మానసిక వికలాంగులకు పరికరాల పంపిణీకి కొడంగల్‌లో బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రత్యేక క్యాంప్ నిర్వహించనున్నట్లు జిల్లా వయోవృద్ధుల సంక్షేమశాఖ వారు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వయోవృద్ధుల సంక్షేమశాఖ, అలింకో ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారి సౌజన్యంతో నిర్వహించే ప్రత్యేక క్యాంపులో దివ్యాంగులు, మానసిక వికలాంగులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్యాంపు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. క్యాంపునకు వచ్చేవారు విధిగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సదరం క్యాంపులో 40 శాతం పైబడి ఇచ్చిన సదరం ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాలని కోరారు.

మళ్లీ నిరాశే..!

- ఉమ్మడి జిల్లాకు దక్కని అమాత్య పదవి
- భంగపడిన ఎమ్మెల్యేలను బుజ్జగిస్తున్న అధిష్ఠానం
- రంగారెడ్డి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రే దిక్కు



రంగారెడ్డి అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మంత్రి వర్గ విస్తరణలో చోటు దక్కని ఎమ్మెల్యేలు తీవ్ర నిరాశలో ఉన్నారు. పదవులు దక్కించుకున్న వారు సంబరాల్లో మునిగితే, ఆశించి భంగపడిన నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వికారాబాద్ ఎమ్మెల్యే, స్పీకర్‌గా కొనసాగుతున్న గడ్డం ప్రసాద్‌కుమార్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. అలాగే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మంత్రిపదవిపై ఆశించారు. వీరంతా మంత్రి పదవి ఇవ్వాలని ఢిల్లీ పెద్దలను కలిసి కోరారు. ఒక్కో సందర్భంలో తమకే మంత్రి పదవి వస్తుందన్న నమ్మకంలో తేలియాడారు. ఈ విషయాన్ని తమ అనుచరులు, కార్యకర్తలతో తరచూ చర్చించారు. అయితే చివరి నిమిషంలో అధిష్ఠానం వీరికి మొండిచేయి చూపడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఉమ్మడి జిల్లా నుంచి సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండగా మళ్లీ ఇంకా మంత్రులు ఎందుకనే ఉద్దేశంతో ఎవరికీ ఆ పదవి దక్కకపోయి ఉండవచ్చన్న వాదన వినిపిస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు పదవి దక్కకపోవడంతో ప్రస్తుతం ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబే దిక్కయ్యారు. అధికార, ప్రతిపక్ష నేతలు ప్రతీ పనికి ఇన్‌చార్జి మంత్రిని ఆశ్రయించాల్సి వస్తుంది. మంత్రి పదవి ఆశించి భంగపడ్డ ఎమ్మెల్యేలను ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి టీపీసీసీ అధ్యక్షుడు, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు మలక్‌పేట్ తిరుమలా హిల్స్‌లోని మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంటికి వచ్చి ఆయనతో మాట్లాడారు.

యువ వికాసం..
మరింత ఆలస్యం

నిరుద్యోగులకు తప్పని నిరీక్షణ

- పూర్తికాని అర్హుల ఎంపిక ప్రక్రియ
- జిల్లాకు కేటాయించిన యూనిట్లు 15,275
- వచ్చిన మొత్తం దరఖాస్తులు 57,844
- రూ.4లక్షల విలువైన యూనిట్లకే అధిక అర్జీలు



నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించాలన్న ఉన్నతాశయంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకం అమలు మరింత ఆలస్యం కానున్నట్లు తెలుస్తోంది. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పథకం అమలుకు శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు చేసినా చివరకు వాయిదా పడింది. దీంతో మరికొంత కాలం నిరుద్యోగులకు నిరీక్షణ తప్పేలా లేదు. రూ.50 వేల నుంచి రూ.4 లక్షల ఆర్థిక సాయం కోసం జిల్లా వ్యాప్తంగా 57,844 మంది దరఖాస్తు చేసుకున్నారు.

వికారాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని నిరుద్యోగ యువత భావించినా ఈ అంశం అంతగా చర్చకు రాలేదని తెలుస్తోంది. ఫలితంగా ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న యువతీ యువకులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఉపాధి కోసం ఇచ్చే రుణాల్లో రూ.50 వేలు తీసుకుంటే శతశాతం రాయితీ కల్పించనున్నారు. రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు 90 శాతం రాయితీ, రూ. లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం, రూ.4 లక్షల రుణం తీసుకుంటే 70 శాతం రాయితీ ఇవ్వనున్నారు.

అగ్ని పరీక్షగా మారిన అర్హుల ఎంపిక

జిల్లాలో 4 మున్సిపాలిటీలు, 20 మండలాలు ఉండగా, బల్దియాలు, మండలాల వారీగా దరఖాస్తుల జాబితాను రూపొందించి పరిశీలన, అర్హుల ఎంపిక చేపట్టారు. ప్రాథమికంగా రూపొందించిన అర్హుల జాబితాలను కలెక్టర్ చైర్మన్‌గా

మిగతా 8వ పేజీలో...

కార్పొరేషన్ల వారీగా వివరాలు

కార్పొరేషన్	యూనిట్లు	దరఖాస్తులు
ఎస్సీ	4,677	12,764
ఎస్టీ	2,730	6,616
బీసీ	4,735	23,180
ఈబీసీ	1,235	1,079
మైనార్టీ	1,804	14,152
క్రిస్టియన్	94	53
మొత్తం	15,275	57,844



కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో యువ వికాసం దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

అన్ని వర్గాల వారి నుంచి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు ఆర్థికంగా వెనకబడిన తరగతుల నుంచి కూడా దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాకు మొత్తం 15,275 యూనిట్లు మంజూరు కాగా, 57,844 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాకు రూ.50 వేల యూనిట్లు 4,704 కేటాయించగా 790, రూ. లక్ష యూనిట్లు 3,719 మంజూరు కాగా, 2,485 దరఖాస్తులు వచ్చాయి. రూ. లక్ష నుంచి రూ.2 లక్షల వరకు యూనిట్లు 3,116 కేటాయించగా 5,921 దరఖాస్తులు వచ్చాయి. రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు యూనిట్లు 655 మంజూరు కాగా, 3,267 దరఖాస్తులు వచ్చాయి. రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు 1,062 యూనిట్లు కేటాయించగా 9,589 దరఖాస్తులు వచ్చాయి. రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు యూనిట్లు 2,019 మంజూరు కాగా, 35,792 దరఖాస్తులు వచ్చాయి.

గనుల శాఖకు
భారీ ఆదాయం

- త్రైమాసికంలోనే రూ.12.62 కోట్ల రాబడి
- మూడు బ్లాక్‌లకు ఆన్‌లైన్‌లో టెండర్లు పూర్తి
- రూ.3.15 కోట్లు జమ
- పెద్ద నందిగామ మినరల్ టెండర్ వాయిదా



టెండర్లు పూర్తి చేసిన మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏడీ సత్యనారాయణ, సిబ్బంది

తాండూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి):గనులు, భూగర్భ వనరులశాఖ ఆదాయం సమీకరించడంపై దృష్టిపెట్టింది. ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియ ద్వారా పారదర్శకంగా మైనింగ్ వేలంను నిర్వహించింది. వికారాబాద్ జిల్లా పరిధిలో నాలుగు మినరల్ బ్లాకులు ఉన్నాయి. ఆన్‌లైన్ ద్వారా ఈ బ్లాకులను మైన్స్‌శాఖ వేలంను నిర్వహించారు. మోమిన్‌పేట్ మండలం గోవిందాపూర్‌లో సర్వే నంబర్ 142, పూడూరు మండలం మాచన్‌పల్లిలో సర్వే నంబర్ 273, నవాబ్‌పేట్ మండలం మీనపల్లికలాన్ సర్వే నంబర్ 7లో, కొడంగల్ మండలం పెద్ద నందిగామలో సర్వే నంబర్ 277లో బ్లాకులు ఉన్నాయి. మూడు లాటరైట్ బ్లాకులు కాగా, నందిగామలో స్టోన్ మెటల్ బ్లాకు ఉంది. ఇందులో గోవిందాపూర్, మాచన్‌పల్లి, మీనపల్లికలాన్ మినరల్ బ్లాకులను స్టోన్ క్రషర్‌కై లీజులను దక్కించుకున్నారు.

ఉత్తర్వులు పూర్తయ్యాక చెల్లింపులు

తాండూరు మైన్స్‌శాఖకు త్రైమాసికంలోనే రూ.3.15 కోట్ల ఆదాయం సమకూరింది. మిగిలిన రూ.9.47 కోట్ల డీఎండీ అనుమతి ఉత్తర్వులు జారీ ప్రక్రియ పూర్తయ్యాక చెల్లింపు చేయాల్సి ఉంటుందని మైన్స్‌శాఖ ఏడీ సత్యనారాయణ వివరించారు. కొడంగల్

మిగతా 8వ పేజీలో...



బషీరాబాద్‌లో ఇంటర్ తరగతులు

- రెండేళ్ల కిందటే కళాశాల మంజూరు
- కొత్తగా ఎనిమిది మంది అధ్యాపకుల నియామకం
- జెడ్పీ స్కూల్ ప్రాంగణంలో బోధన
- ఎమ్మెల్యే చొరవ.. విద్యార్థుల హర్షం

7



మామిడికి భలే డిమాండ్

7

- ప్రారంభమైన తొక్కుల సీజన్
- కిటకిటలాడుతున్న మార్కెట్లు
- సైజ్‌ను బట్టి కాయల ధరలు



జ్ఞానమాల కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆస్ట్రేలియా ఎంపీలు

అంబేడ్కర్ అందరికీ ఆదర్శం

కీసర, జూన్8(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ప్రపంచ దేశాలకు ఆదర్శమని మేడ్చల్ ఎమ్మెల్యే చామాకూర మల్లారెడ్డి అన్నారు. కీసరలో అంబేడ్కర్ సంఘం అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జ్ఞానమాల కార్యక్రమానికి ఆయనతో పాటు ఆస్ట్రేలియా ఎంపీలు షినావాట్, లి టార్లమిస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రతినిధులకు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయమైన బతుకమ్మ, బోనాలతో స్వాగతం పలికారు. అనంతరం కీసర ప్రధాన చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా కీసరగుట్ట రామలింగేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు అర్చకులు ఎమ్మెల్యే మల్లారెడ్డితో పాటు, ఆస్ట్రేలియా ఎంపీలను ఆశీర్వచనలు అందజేసి, స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు.

కీసర వార్డు కార్యాలయం ఉండాల్సిందే

కీసర, జూన్8(ఆంధ్రజ్యోతి): కీసర వార్డు కార్యాలయం ఉండాల్సిందేనని ఆయా పార్టీల నాయకులు ఆదివారం కీసర ప్రధాన చౌరస్తాలో ఆందోళన చేశారు. ఇటీవల మండలంలోని 10 గ్రామాలను నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్‌లో విలీనం చేశారు. దీంతో పంచాయతీ కార్యాలయాలను వార్డు కార్యాలయాలుగా సమస్యలు తీరుస్తున్నారు. దమ్మాయిగూడ మున్సిపల్‌లో విలీనమైన కీసర.. వార్డు కార్యాలయాన్ని తీసేసే ఆలోచనలో అధికారులు ఉన్నారని, ఆ నిర్ణయాని వ్యతిరేకిస్తూ పలు రాజకీయ నేతలు ఆందోళన చేపట్టారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండాలంటే కీసరలో వార్డు కార్యాలయం ఉండాల్సిందేనని నాయకులు అధికారులను డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ఆందోళనను విరమించారు.

అంతా ప్లాస్టిక్ మయం!

- కనుమరుగవుతున్న కుండలు
- మార్కెట్‌లో ప్లాస్టిక్ బిందెలు, బ్యారెళ్ల విక్రయాల జోరు
- ఆదరణ కోల్పోతున్న కుల వృత్తులు



పరిగి మార్కెట్‌లో జోరుగా ప్లాస్టిక్ బిందెల విక్రయాలు ఇలా



గ్రామాల్లో అమ్మేందుకు తరలిస్తున్న ప్లాస్టిక్ బ్యారెళ్లు

పరిగి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సమాజం దినదినాభివృద్ధి చెందుతుండడంతో ప్రజలు మార్కెట్‌లోకి అధునాతనంగా వస్తున్న వస్తువులపై మోజు చూపుతున్నారు. మార్కెట్‌లో పలు నూతన వస్తువులను అమ్ముకుంటూ కొందరు ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు కుమ్మరులకు ఆదరణ ఉండేది. నానాటికి మట్టి పాత్రలు వాడకం తగ్గి కుమ్మరులు కుండలు చేయడమే మానుకున్నారు. ప్రస్తుతం చాలా రకాల వస్తువులు ప్లాస్టిక్‌వే వాడుతున్నారు. గ్లాస్ నుంచి బిందెలు ఇంకా అన్ని వస్తువులూ ప్లాస్టిక్‌వి వాడుతున్నారు. ఒక కుల వృత్తుల వారికి ఆదరణ లేక, ఉపాధి దొరకక సతమతమవుతుంటే మరో విధంగా ప్లాస్టిక్ వస్తువులను అమ్ముతూ ఉపాధి పొందుతున్నారు. హిందూ సంప్రదాయం ప్రకారం కొన్ని సమయాల్లో మట్టితో చేసిన పాత్రలు ఉపయోగించాల్సి ఉంటుంది. ఆ సంప్రదాయమే ఇంకా తమని బతికిస్తోందని కుల వృత్తి చేసుకుంటున్న కుమ్మరులు అంటున్నారు. వేసవి కాలం వచ్చిందంటే చల్లని నీటి కోసం మట్టి కుండలను ఉపయోగించేవారు. అలాంటిది ఇప్పుడు అరకొర కుండలు కొంటున్నారు. ఇలా ఆధునిక సాంకేతికతతో చేతి వృత్తుల వారైన కమ్మరి, కుమ్మరి, కంసాలి, వడ్రంగి పనుల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. వారి వస్తువులు అమ్ముడవడం లేదు.

ప్లాస్టిక్ బిందెల అమ్మకాల జోరు

మట్టి, ఇత్తడి, స్టీల్ బిందెల వినియోగం బాగా తగ్గింది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ బిందెలే కన్పిస్తున్నాయి. రోజువారీ వాడకానికి ఎక్కువ మంది ప్లాస్టిక్ బిందెలే కొంటున్నారు. వ్యాపారులు గ్రామాలకు తీసుకెళ్లి అమ్ముతున్నారు. ఒక్కో బిందె నాణ్యత బట్టి రూ.50 నుంచి రూ.120కి విక్రయిస్తున్నారు. కుండలతో పోలిస్తే అవి పగిలిపోయే పరిస్థితి లేకపోవడంతోనూ ప్లాస్టిక్‌ను ఎక్కువ కొంటున్నారు. బైక్‌లు, ఆటోలు, మినీ ట్రక్కుల్లో బిందెలు, డబ్బాలను తరలించి అమ్ముతున్నారు. కొందరు వ్యాపారులు కూలీలతో అమ్మిస్తున్నారు. 200లీటర్ల సామర్థ్యం గల బ్యారెళ్లు నాణ్యతను బట్టి రూ.700 నుంచి రూ.1,200కు అమ్మకాలు సాగిస్తున్నారు.

ఉపాధి కరువైంది



మార్కెట్‌లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం బాగా పెరిగింది. మట్టి కుండల వాడకం తగ్గిపోయింది. కులవృత్తిని నమ్ముకున్న మాకు కూడా కరువైంది. ప్రభుత్వం కుమ్మరులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

- కుమ్మరి లక్ష్మయ్య, పరిగి

వైభవంగా గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన

ఘట్‌కేసర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధి చౌదరిగూడలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు వైభవంగా నిర్వహించారు. లక్ష్మీ గణపతి విగ్రహాలతోపాటు నవగ్రహాలు, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి వేర్వేరుగా తమ అనుచరులతో కలిసి స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చౌదరిగూడ మాజీ సర్పంచ్ బైరు రమాదేవి రాములుగౌడ్, సంజీవరెడ్డి, శ్రీనివాస్, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, నర్సింగ్‌రావు, బోజిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే మల్లారెడ్డి



పూజా కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్

చేయి తడపకుంటే సీజ్!

- చిరు వ్యాపారులపై వార్డు ఆఫీసర్ల ప్రతాపం
- మేడ్చల్ మున్సిపాలిటీలో అధికారుల తీరు



మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం

మేడ్చల్ టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మున్సిపాలిటీలో ఇటీవల విధుల్లో చేరిన కొందరు వార్డు ఆఫీసర్ల పనితీరుపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చిరు వారు వ్యాపారులపై జులుం ప్రదర్శిస్తూ దుకాణాలు, తోపుడు బండ్లను సీజ్ చేస్తామని హెచ్చరిస్తూ బెదిరింపులకు గురిచేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చికెన్ షాపుల వంటి వాటిపై మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. అపరిశుభ్ర, కుళ్లిపోయిన ఆహార పదార్థాలు, పాడైపోయిన తినుబండారాలు వంటివి లభిస్తే సీజ్ చేస్తున్నారు. అంత వరకు బాగానే ఉన్నా.. ఇదే అదనుగా కొందరు వార్డు ఆఫీసర్లు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లను సీజ్ చేస్తామని బెదిరిస్తున్నారని చిరు వ్యాపారులు వాపోతున్నారు.

ఒకవైపు తనిఖీలు.. మరోవైపు వసూళ్లు

మధ్యాహ్నం సీజ్ చేసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, ఓ హోటల్‌ను కూడా చేయి తడిపితే సాయంత్రమే తెరిపిస్తున్నారంటే అధికారుల పనితీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు అంటున్నారు. అధికారుల యావంతా లంచం డబ్బులపైనే గానీ ప్రజల ఆరోగ్యంపై కాదని, ప్రజల పేరు చెప్పి వ్యాపారుల నుంచి డబ్బు దండుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. మేడ్చల్ పట్టణ పరిధి కేఎల్లార్ వెంచర్, బాలాజీనగర్ తదితర కాలనీల్లో ఫాస్ట్‌ఫుడ్, హోటళ్లు, చికెన్ దుకాణాలపై దాడులు నిర్వహించిన ముగ్గురు వార్డు అధికారులు అందులో ఓ హోటల్‌ను, మరో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో చెడిపోయిన ఆహారపదార్థాలను సీజ్ చేశారు. మునిసిపాలిటీ అధికారిక వాట్సాప్ గ్రూప్‌లోనూ హోటల్‌ను సీజ్‌చేసినట్లు ఫొటో దిగి పైఅధికారులకు ఈ సమాచారాన్ని పోస్ట్ చేశారు. అదే సాయంత్రం సీజ్ చేసిన హోటల్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ మాత్రం తెరిచే ఉండటంతో కాలనీ వాసులు అవాక్కయ్యారు. దీనిపై ఆరాతీయగా అధికారుల చేయితడిపితే వదిలివేశారని ఫాస్ట్‌ఫుడ్, హోటల్‌ల నిర్వాహకులు చెప్పిన సమాధానం విని ఆశ్చర్యపోయారు. మేడ్చల్ మున్సిపాలిటీలో పైఅధికారుల నిఘా లేక వార్డుఅధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిందనే ఆరోపణలొస్తున్నాయి. మున్సిపల్ ఉన్నతాధికారులు పట్టించుకుని వార్డు అధికారుల తీరుపై నిఘా ఉంచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అలరించిన చిన్నారుల సంగీత ప్రదర్శన

షాద్‌నగర్ అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని ఈశ్వర్‌కాలనీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన చిన్నారుల సంగీతం అలరించింది. స్వరరాగ సంగీత సుధా మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు ఎం.ప్రేమ్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు సందర్భంగా చిన్నారుల సంగీత ప్రదర్శన నిర్వహించారు. క్యాంపులో నేర్చుకున్న బాలబాలికలతో పాటు అకాడమీ పూర్వ విద్యార్థులు పాల్గొన్ని తమ సంగీతంతో అకట్టుకున్నారు. చిన్నారులు గిటార్, వయోలిన్, హార్మోణియం వాయిస్తున్న విధానానికి వారి తల్లిదండ్రులు ఆనందించారు. కార్యక్రమంలో కొండపల్లి శ్రీనివాస్ వయోలిన్, బి.జనార్థన్ మృదంగం, ఎ.నర్సింహచారి తబలా వాయించారు. వైష్ణవి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు మహేందర్‌రెడ్డి, సలేంద్రంరాజేశ్వర్ చిన్నారులను అభినందించి, బహుమతులు అందజేశారు.



సంగీతం వాయిస్తున్న చిన్నారులు

నేడు కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం

ఇబ్రహీంపట్నం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కేంద్రీయ మెట్ట పరిశోధన కేంద్రం(క్రీడా) ఆధ్వర్యంలో సోమవారం ఆదిభట్ల పరిధి మంగల్‌పల్లిలో జరిగే కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహా న్ పాల్గొంటారని అధికారులు తెలిపారు. బొంగులూరు కళ్లెం జంగారెడ్డి గార్డెన్స్‌లో సాయంత్రం 3:30నుంచి 4:40గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు.

విదేశాలకు మహిళల తరలింపు.. ముఠా గుట్టు రట్టు

- పోలీసుల అదుపులో నిందితుడు

శంషాబాద్ రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): విదేశాలకు అక్రమంగా మహిళలను తరలిస్తున్న ముఠాను పోలీసులు గుట్టురట్టు చేశారు. ఈ ఘటనలో విజిటింగ్ వీసాలపై ఉపాధి కోసం నిరుద్యోగులను విదేశాలకు పంపుతున్న కేసులో ఓ మాజీ హోంగార్డును ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులు అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు మస్కట్‌లో ఉపాధి కోసం వెళ్తుండగా వారి పత్రాలను పరిశీలించిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఇమ్మిగ్రేషన్ అధికారులు వారి దగ్గర విజిటింగ్ వీసాలున్నట్లు గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకొచ్చాయి. అదే ప్రాంతానికి చెందిన సత్యనారాయణ గతంలో హోంగార్డుగా పని చేసేవాడు. ఇటీవల ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన సుందరం అనే వ్యక్తి ద్వారా ఉపాధి కోసం విదేశాలకు వెళ్లే వ్యక్తులను తప్పుడు మార్గాల్లో పంపి డబ్బులు సంపాదించే పనిలో పడ్డాడు. ఉపాధి వీసాలకు డబ్బుల ఖర్చుతో పాటు కఠిన నిబంధనలు ఉండటంతో వారిని విజిటింగ్ వీసాల్లో విదేశాలకు పంపుతూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఇప్పటికే పలువురిని పంపిన వారు తాజాగా శనివారం మస్కట్‌లో ఉన్న ఏజెంట్ సుందరం ఏర్పాటు చేస్తున్న రోల్డ్ గోల్డ్ అండ్ ఫ్యాన్సీ సెంటర్‌కు శాంపిల్ రోల్డ్ గోల్డ్ అభరణాలు పంపే ప్రయత్నంలో సత్యనారాయణను ఆర్‌జీఐఏ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు గల్ఫ్ దేశాలకు పీఓఈ సర్టిఫికేట్ లేకుండా మహిళలను అక్రమంగా పంపించేందుకు కొత్త మార్గాలు అన్వేషిస్తున్న హ్యూమన్ ట్రాఫికింగ్ ముఠాకు చెందినవాడని వెల్లడైంది. గతంలో పోలీసులు గల్ఫ్ దేశాలకు వర్క్ వీసా పొందిన మహిళలను పీఓఈ సర్టిఫికేషన్ లేకుండా పంపించే ఏజెంట్లను పట్టుకున్నారు. వారు ఇమిగ్రేషన్ అధికారులను మోసం చేయడంలో భాగంగా మహిళలు విజిట్ విసాపై వెళ్తున్నట్లు అబద్ధంగా చెబుతూ వారి వీసాలపై క్యాన్సల్డ్ ముద్ర వేయించారు. ఈ విధానం బయటపడిన తర్వాత మస్కట్‌లో ఉన్న సుందరం కొత్త మార్గాలను ఎంచుకున్నాడు. సుందరం ఒక్క మనిషిని పంపించేందుకు రూ.1.5 లక్షలను గల్ఫ్ దేశస్థుల నుంచి తీసుకుంటున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసుతో విషయం బయటపడటంతో పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. అతని దగ్గర ఉన్న రోల్డ్ గోల్డ్ శాంపిల్ అభరణాలు, ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



నిందితుడు సత్యనారాయణ

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



మక్తవెంకటాపూర్ ప్రధాన రోడ్డు పక్కన కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చౌటుప్పల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. చిన్న చిన్న సమస్యలు ఏర్పడినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి వచ్చే మిరుగులతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు, చేతికందే ఎత్తులో విద్యుత్ తీగల కారణంగా ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. చౌడాపూర్ మండలంలోని మక్తవెంకటాపూర్ గ్రామ శివారులో ప్రధాన రహదారి పక్కన కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో మేకలు మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి. వర్షాకాలం కావడంతో సమీపం నుంచే రాకపోకలు కొనసాగించే వాహనదారులు, రైతులు, మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- పట్టించుకోని విద్యుత్ అధికారులు

చేతికందే ఎత్తులోనే విద్యుత్ తీగలు



మక్త వెంకటాపూర్ శివారులోని పొలాల్లో చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. వ్యవసాయ పనులకు వెళ్లాలంటే భయంగా ఉంది. వైర్లు సరిచేయాలని ఎన్నిసార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. గ్రామంలో పర్యటించిన సమయంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

- గంగ్యానాయక్, మక్తవెంకటాపూర్

పలు చోట్ల మోస్తరు వర్షం



నల్లవెల్లి పంట పొలాల్లో కురిసిన వర్షం

యాచారం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తి తొలి రోజు ఆదివారం మండలంలోని మాల్, తమ్మలోనిగూడ, నల్లవెల్లి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. మాల్‌లో నాగార్జున సాగర్-హైదరాబాద్ రహదారిపైకి ఓ వెంచర్ నుంచి భారీగా వరద నీరు పారడంతో ఫీట్ లోతు మట్టిదిబ్బలు పేరుకుపోవడంతో ద్విచక్రవాహనా దారులు ఇబ్బందులు పడ్డారు. గంటన్నర పాటు వర్షం కురిపింది. ఈ వర్షం కారణంగా సోమవారం నుంచి విత్తనాలు వేసుకునేందుకు వీలుందని రైతులు చెప్పారు. మృగశిర కార్తె తొలిరోజు వర్షం కురియడంతో రైతులు సంబరపడుతున్నారు. ఈ వర్షంతో మూడు రోజుల పాటు విత్తనాలు వేసుకుంటామని రైతులు తెలిపారు. యాచారం, నందివనపర్తి, మల్కీజ్‌గూడ, చౌదర్‌పల్లి గ్రామాల్లోనూవర్షం కురిసింది.



మాల్‌లో రహదారిపై పారుతున్న వరద

హనుమాన్ ఆలయ అపవిత్రంపై ఆగ్రహం

- దుండగులను శిక్షించాలని గుడి వద్ద ధర్నా

షాద్‌నగర్ అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని పటేల్ రోడ్డులో గల హనుమాన్ ఆలయంలో మాంసాన్ని పెట్టి అపవిత్రం చేయడంపై బీజేపీ, వీహెచ్‌పీ, హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దుండగులను కఠినంగా శిక్షించాలని ఆదివారం ఆ సంఘాలు ధర్నా చేశాయి. శనివారం ఆలయంలో ఉన్న ఓ చిన్నారిని గేటు వరకు పిలిచిన ఓ దుండగుడు మాంసం కవరును ఇచ్చి, ఆలయంలో పెట్టించిన దృశ్యం సీసీ కెమెరాల్లో రికార్డైంది. ఈ విషయం తెలుసుకున్న వీహెచ్‌పీ నాయకుడు బండారి రమేష్, బీజేపీ నాయకులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, చెట్ల వెంకటేష్, హిందూ సంఘాల నాయకులు ఆలయానికి చేరుకుని జరిగిన సంఘటనపై తెలుసుకున్నారు. ఆలయంలో మాంసం పెట్టి అపవిత్రం చేయడమే కాకుండా మత ఘర్షణలు సృష్టించాలనే దుండగులు కుట్ర పన్నారని. వారిని పట్టుకుని శిక్షించాలని ఆందోళన చేశారు. అక్కడికి చేరుకున్న సీఐ విజయ్‌కుమార్ నిరసన వ్యక్తం చేస్తున్న వారితో మాట్లాడి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సంఘటనపై సీసీ కెమెరాల ఫుటేజీ సేకరించి పోలీసులు విచారణ చేస్తున్నారు.



హనుమాన్ ఆలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న హిందూ సంఘాలు

రెండేళ్లుగా నిండని
చెరువు, కుంటలు

- చింతపట్ల, తాటిపర్తి చెరువుల్లో కొద్ది పాటి నీరు
- ఈ ఏడాదైనా నిండాలని కోరుకుంటున్న రైతులు
- యాచారం మండలంలో 116 నీటి వనరులు



రెండేళ్లుగా చుక్క నీరు లేని కుర్మిద్ద పెద్ద చెరువు

యాచారం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ముందుగా వచ్చినా ఈ ఏడాదైనా చెరువులు, కుంటలు నిండేనా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 116 చెరువులు, కుంటలున్నాయి. రెండేళ్లుగా ఏ ఒక్క చెరువు, కుంటల్లోకి తగినంత నీరు చేరలేదు. రెండేళ్ల క్రితం కురిసిన వర్షాలకు భారీగా వచ్చిన చేరిన వరదతో కేవలం చింతపట్ల లక్ష్మణ్‌చెరువు, తాటిపర్తి బంధం చెరువుల్లో కొద్దిపాటి నీరుంది. చింతపట్ల లక్ష్మణ్ చెరువులో టిక్కీ పరిధిలో మాత్రమే నీరుంది. మరో 114 చెరువులు, కుంటల్లో చుక్కనీరు లేదు. భూగర్భజలం పడిపోయింది. కుర్మిద్ద పెద్ద చెరువు, మేడిపల్లి లక్ష్మణ్ చెరువు, సాలిచెరువు, నల్లవెల్లి పెద్దచెరువులు ఎండిపోయి ఏడాదైంది. గత వర్షాకాలంలో భారీ వర్షాలు కురియక చెరువుల్లోకి నీరు చేరలేదు. మండలంలో చెరువులు, కుంటలు ఎండిపోవడంతో గ్రామాల్లో రబీలో వరి తక్కువ సాగు చేసినా ఎండిపోయాయి.

రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నమోదైన వర్షపాతం

సంవత్సరం	సాధారణ వర్షపాతం	కురిసింది
2019-20	694.6 ఎంఎం	745.8ఎంఎం
2020-21	694.6 ఎంఎం	1225.2ఎంఎం
2021-22	694.6 ఎంఎం	953.5 ఎంఎం
2022-23	694.6 ఎంఎం	1120.3ఎంఎం
2023-24	725.8 ఎంఎం	721.9 ఎంఎం
2024-25	725.8ఎంఎం	916.9 ఎంఎం

యాసంగిలో వరి పంట ఎండిపోయి నష్టపోయాను



రెండేళ్ల నుంచి వానలు బాగ కురియక చెరువులు, కుంటలు నిండలేదు. దాంతో బోర్ బావులు చాలా తక్కువ నీరుపోస్తున్నాయి. రబీలో రెండు మడుల్లో వరి పంట వేస్తే మొత్తం ఎండిపోయి నష్టపోయాను. ఈ సారైనా చెరువులు, నిండుతాయో లేదో తెలుస్తలేదు.

- కడారి శేఖర్, రైతు, నజ్దిక్‌సింగారం

మైనింగ్ అనుమతులను రద్దు చేయాలి



టైగర్ కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకుడు

మర్పల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి):మర్పల్లి మండలంలోని వీరపల్లి శివారులోని సర్వే నం: 211, 212లలో ఇచ్చిన మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు టైగర్ భూమోళ్ల కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేదంటే హైకోర్టుకు వెళ్లి కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రెండు సంవత్సరాల క్రితం ఇవే సర్వే నంబర్‌లలో హైదరాబాద్‌కు చెందిన హరికృష్ణకు మైనింగ్ అనుమతులు ఇచ్చేందుకు అధికారులు, జిల్లా అదనపు కలెక్టర్, పొల్యూషన్ బోర్డు అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేసినప్పుడు వీరపల్లి గ్రామస్తులు వ్యతిరేకించారన్నారు. మైనింగ్ లీజుకు తీసుకోవాలనుకున్న హరికృష్ణ హైదరాబాద్ నుంచి లక్షలాది రూపాయలు ఇచ్చి ఎన్జీవో సంస్థలను, కిరాయికి ప్రజలను తీసుకొచ్చి ప్రజాభిప్రాయ సేకరణను అనుకూలంగా చెప్పించుకునే ప్రయత్నం చేశారన్నారు. బయటి వారిని గ్రామస్తులు తరిమేశారన్నారు. అప్పటి అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఆర్డీవో, మర్పల్లి తహసీల్దార్ మైనింగ్‌ను ఆపివేయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు అనుమతెలా ఇస్తారని ప్రశ్నించారు. వీర్లపల్లిలో మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని కలెక్టర్ కార్యాలయం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వద్ద గ్రామస్తులతో ధర్నా చేస్తామని అన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



అయ్యప్ప ఆలయంలో నిర్వహిస్తున్న పూజలు



పూజా కార్యక్రమానికి వచ్చిన సద్గురు సచ్చిదానంద సరస్వతి

శంకర్‌పల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్‌లోని తుని తపోవనం పీఠాధిపతి సద్గురు సచ్చిదానంద సరస్వతి తెలిపారు. శంకర్‌పల్లిలోని అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆదివారం రాత్రి ఆయన హాజరయ్యారు. అయ్యప్ప స్వామికి ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులనుద్దేశించి ప్రసంగించారు. భారతదేశం సనాతన ధర్మానికి పుట్టినిల్లన్నారు. అయ్యప్పస్వామిని నిత్యం పూజిస్తే కష్టాలు తొలగుతాయని వివరించారు. కార్యక్రమంలో సేవా భజన విపంచిశర్మ ఆలయ కమిటీ, అయ్యప్ప సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు..
జాతీయ రహదారిపై వంతెనలు

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెల్లడి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): 44వ జాతీయ రహదారి చౌరస్తాల్లో జరుగుతున్న ప్రమాదాల నివారణకు ఎక్కడికక్కడ వంతెనలు నిర్మిస్తున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. షాద్‌నగర్ అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో మూడు వంతెలను మంజూరు చేయించామని తెలిపారు. ఒక్కొక్క వంతెనను 35కోట్లతో నిర్మిస్తారన్నారు. అధికంగా ప్రమాదాలు జరుగుతున్న కొత్తూర్ సమీపంలోని జహంగీర్‌పీర్ దర్గా చౌరస్తా, షాద్‌నగర్ సమీప కేశంపేట రోడ్డు చౌరస్తా, బూర్గుల చౌరస్తా వద్ద బ్రిడ్జిలు నిర్మిస్తామన్నారు. చౌరస్తాల్లో వంతెల నిర్మాణాలు పూర్తయితే ప్రమాదాలు పూర్తిగా తగ్గుతాయని ఎమ్మెల్యే శంకర్ అభిప్రాయపడ్డారు.



జాతీయ రహదారిపై కేశంపేట రోడ్డు చౌరస్తా

ప్రతీ వ్యక్తి ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



మల్లన్నస్వామి కల్యాణంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి


కొత్తూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. ఇన్ముల్‌నర్వలో నూతనంగా నిర్మించిన కేతాలమ్మ, మేడాలమ్మ సమేత మల్లన్న ఆలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్సీ హాజరై పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఈట గణేష్, మాజీ సర్పంచ్ అజయ్‌మిట్టునాయక్, నాయకులు వై.మురళీకృష్ణయాదవ్, ఎమ్మె సత్యానారాయణ, కడెంపల్లి శ్రీనివాస్, బి.దేవేందర్‌యాదవ్, కృష్ణ, విఠల్, కోస్గి శ్రీనివాస్, అశోక్, శ్రీరాములు, గోపాల్‌నాయక్, బల్వంతరెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, శివాచారి, జంగయ్య, రమేష్, మహేష్, శ్రీను యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అంగన్‌వాడీ వారోత్సవాలు

తాండూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతమే లక్ష్యంగా వారోత్సవాలు నిర్వహించనున్నారు. పౌష్టికాహారం, మూడేళ్లు దాటి ఐదేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించేందుకు ఈ నెల 10నుంచి 17వ తేదీ వరకు 'అమ్మ మాట-అంగన్‌వాడి బాట' పేరిట ప్రభుత్వం అంగన్‌వాడీ వారోత్సవాలు నిర్వహించనుంది. మహిళా, శిశు సంక్షేమశాఖ ఆ ధ్వర్యంలో వీటిని నిర్వహిస్తారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని అంగన్‌వాడీ టీచర్లకు ఆదేశాలిచ్చారు. సీడీపీవో, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో కార్యక్రమం కొనసాగుతుంది. పదో తేదీన కేంద్రాల్లో తల్లులతో, స్వయం సహాయక సంఘాలు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తారు. 11న మూడేళ్లు నిండిన పిల్లల ఉన్న ఇళ్లకు వెళ్లి వారిని అంగన్‌వాడీలో చేరేలా తల్లితండ్రులను ఒప్పిస్తారు. 12, 13, 16 తేదీల్లో పోషణ్ కిచెన్ గార్డెన్ల అభివృద్ధి, పోషకాహారంపై వివరిస్తారు. 17న చిన్నారుల అక్షరాభ్యాసం నిర్వహిస్తారు. అంగన్‌వాడీల్లో రెండేళ్లు ఉన్న పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే, స్కూల్‌లో చేర్పించడం, స్టడీ మెటిరియల్ అందజేత చేపడతారు. వివిధ కేంద్రాల్లో పారిశుధ్య నిర్వహణ ర్యాలీలు నిర్వహిస్తారు.

ఈ సారి నుంచి
బషీరాబాద్‌లో ఇంటర్ తరగతులు

- రెండేళ్ల కిందే కళాశాల మంజూరు
- కొత్తగా 8 మంది అధ్యాపకుల నియామకం
- జెడ్పీ స్కూల్ ప్రాంగణంలో బోధన
- ఎమ్మెల్యే చొరవ.. విద్యార్థులకు మంచిరోజులు



పాత భవనం మారనుందిలా (నమూనా)

బషీరాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి):బషీరాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మంచి రోజులొచ్చాయి. తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి చొరవతో కాలేజీకి అదనంగా ఎనమిది మంది అధ్యాపకులు నియమితులయ్యారు. మండల కేంద్రంలో తరగతుల నిర్వహణకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.నర్సింహారెడ్డి, అధ్యాపకులు కసరత్తు చేస్తున్నారు. పాత జెడ్పీ పాఠశాల భవనంలో కళాశాల ఏర్పాటుకు యోచిస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశంతో ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్‌లు భవనాన్ని పరిశీలించారు. అయితే మండల వాసులు ఇంటర్ కాలేజీ కోసం ఏళ్లుగా ఎదురుచూడగా రెండేళ్ల జూనియర్ కళాశాల మంజూరైంది. తాత్కాలికంగా జెడ్పీ బాలురు పాఠశాలలో ప్రారంభించారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రకటించారు. ఆ తర్వాత కాలేజీ మాత్రం ప్రారంభం కాలేదు. 2024-25 విద్యా సంవత్సరంలో జూనియర్ కళాశాలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను నియమించారు. ఇంటర్ బోర్డు నోడల్ అధికారి శంకర్‌నాయక్, ప్రిన్సిపాల్‌లు కళాశాలను తిరిగి ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. జెడ్పీ పాఠశాలలోని ఓ భవనాన్ని కళాశాలకు కేటాయించి బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో 42 మంది విద్యార్థులను చేర్చుకున్నారు. వారిలో 30మంది బాలికలు ప్రవేశాలు పొందారు. కాలేజీకి ల్యాబ్ మెటీరియల్, ఫర్నిచర్ మంజూరైంది. అయితే అధ్యాపకుల నియామకం కాలేదు. దీంతో అడ్మిషన్ పొందిన విద్యార్థులు తాండూరు జూనియర్ కాలేజీకి పంపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి కొనసాగుతున్నారు. అధ్యాపకులను నియమించాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు.ఆయన సీఎం, డిప్యూటీ సీఎం, ఇంటర్ బోర్డు అధికారులకు సమస్య విన్నవించారు. దీంతో కళాశాలకు 8మంది ఆధ్యాపకులు నియామకమయ్యారు. ఈ సారి నుంచి బషీరాబాద్‌లోనే తరగతులు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ నేతృత్వంలో ఆధ్యాపకులు గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. బషీరాబాద్ మండలానికి తాండూరు 35కిలోమీటర్ల దూరం ఉండటంతో స్థానిక విద్యార్థులు ముఖ్యంగా బాలికలు ఈ కాలేజీలో చదివించేందుకు తల్లిదండ్రులు ముందుకొస్తున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆధ్యాపకుల రాకతో జూనియర్ కళాశాల కష్టాలు తీరినట్లేనని విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామాల్లో ఇంటింటికి తిరిగి విద్యార్థులను కలిసి ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు



జూనియర్ కళాశాల కోసం తాత్కాలిక భవనాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు(ఫైల్)

భవనాన్ని పరిశీలించాం



ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదేశాలతో బషీరాబాద్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటుకు తాత్కాలిక భవనాన్ని పరిశీలించాం. జెడ్పీ పాఠశాల పాత భవనానికి కొద్ది మేర మరమ్మతులు చేస్తే కాలేజీ ఉపయోగపడుతుందని స్థానికులు చెబుతున్నారు. అధ్యాపకులు కూడా కొన్ని సమస్యలు విన్నవించారు. కళాశాల తాత్కలిక భవనం ఏర్పాటు విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం. ఎమ్మెల్యే చొరవతో ఈ ఏడాది పూర్తిస్థాయి అధ్యాపకులతో కళాశాల స్థానికంగా ప్రారంభం కానుండటంతో మండల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

- జి.మాధవరెడ్డి, ఏఎంసీ చైర్మన్, బషీరాబాద్

కళాశాల నిర్వహణకు ఇబ్బందులు తొలిగాయి



బషీరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కొనసాగింపునకు ఇబ్బందులు తీరాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇక్కడే తరగతులు నిర్వహిస్తాం. ప్రభుత్వం కళాశాలకు ఐదుగురు అధ్యాపకులను నియమించింది. మొత్తం 8మంది అధ్యాపకులు కాలేజీలో ఉన్నారు. మండల విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే చేరాలి. నిష్ణాతులైన అధ్యాపకులతో బోధన ఉంటుంది. పుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు ఇస్తాం. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలి.

- ఎస్.నర్సింహారెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

న్యాయమైన పరిహారమివ్వాలి

- ఎకరాకు రూ.50లక్షల పరిహారం అందజేయాలి
- భూములు కోల్పోతున్న రైతు కుటుంబాలకు ఉద్యోగాలివ్వాలి
- ఎమ్మెల్యే నారాయణరెడ్డికి ఇర్విన్ రిజర్వాయర్ నిర్వాసితుల వినతి



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

ఆమనగల్లు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఇర్విన్‌లో ఏర్పాటు చేసే రిజర్వాయర్ మూలంగా తమకు అన్యాయం చేయొద్దని భూ నిర్వాసితులు ప్రభుత్వాన్ని కోరారు. మార్కెట్ ధరకనుగుణంగా ఎకరాకు రూ.50లక్షలు పరిహారం అందించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. మాడ్గుల మండలం ఇర్విన్ రైతులు అఖిల పక్ష నాయకులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. తమ డిమాండ్లను ఎమ్మెల్యేకు వివరించారు. దశాబ్దాలుగా సాగుచేసుకొని జీవనం సాగిస్తున్న తమ భూములు రిజర్వాయర్‌కు తీసుకొని తమకు ఉపాధి లేకుండా చేయొద్దని కోరారు. ఇర్విన్ రిజర్వాయర్ రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. అఖిల పక్ష నాయకులు, రైతులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. రిజర్వాయర్ నిర్మాణం మూలంగా 1,074 ఎకరాలకుపైగా భూములు కోల్పోతామని రైతులు ఎమ్మెల్యేతో వాపోయారు. ఉన్న భూములు పోతే రోడ్డున పడతామని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణానికి గుర్తించిన భూముల్లో వేల తాటి, ఈత వనాలు ఉన్నాయని ఎమ్మెల్యేకు తెలిపారు. దీంతో గీత కార్మికులు కూడా నష్టపోతారని గ్రామ నాయకులు వివరించారు. ప్రభుత్వం తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండ ఎకరాకు రూ.8 లక్షల చొప్పున పరిహారం కొంతమంది రైతుల ఖాతాల్లో జమచేశారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.8లక్షలకు ఎక్కడ గుంట భూమి కూడా రాదని నిర్వాసితులు వాపోయారు. తప్పని పరిస్థితుల్లో భూములు తీసుకుంటే ట్రిపుల్ ఆర్‌కు భూములు కోల్పోయే రైతులకు ఇస్తున్న పరిహారం తమకూ ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి అర్హతను బట్టి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి తగిన పరిహారం అందేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన వారిలో అఖిల పక్ష నాయకులు, రైతులు సూదిని శ్రీనివాస్‌రెడ్డి, పగడాల రవి, దళపతిగౌడ్, రాజమోని జంగయ్య, యాదయ్య, కె.వెంకటయ్య, బి.శంకర్, జార్జిరెడ్డి, యాదయ్య, వెంకటయ్య, శ్రీను, శివ, శ్రీశైలం, కమలేశ్, మల్లయ్య, అంజయ్య, పర్వతాలు, కొండల్, శ్రీశైలం, కృష్ణయ్య, లక్ష్మయ్య, రాములు, యాదయ్య, నర్సహ తదితరులు ఉన్నారు.

తొక్కుల సీజన్...
మామిడికి భలే డిమాండ్



చేవెళ్లలో అమ్ముతున్న తొక్కు మామిడి కాయలు

చేవెళ్ల, మే 23 (ఆంధ్రజ్యోతి):రోహిణి కార్తె మొదలు మృగశిర కార్తె సగం పాదం వరకు పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో మామిడికాయ తొక్కు పెడతారు. ఏడాది పొడవునా నిలువ ఉంచుకునేలా మహిళలు మామిడితో ఆవకాయ, అల్లపావ, తరుగుడు తొక్కులు పెట్టుకుంటారు. భోజనాకి కూరలు లేని సమయాల్లో, రోజూ ఆహారానికి ప్రత్యేక రుచి కోసం పచ్చళ్లను వాడతారు. అయితే ఈ సారి తొక్కు మామిడికాయల రేటు ఎక్కువగా ఉందని ప్రజలంటున్నారు. సాధారణంగా మక్కబట్టే కాయలకంటే తొక్కు కాయలు పుల్లగా ఉంటాయి. అలాంటి కాయలతో తొక్కుపెడితేనే రుచి ఉంటుంది. కాగా కాయల కొరత వల్లే ధర ఎక్కువగా ఉందని వ్యాపారులు చెబుతున్నారు. పచ్చడి కాయలను ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండల కేంద్రాల్లో అమ్ముతున్నారు.

పచ్చడి కాయలకు మంచి డిమాండ్

ప్రతీ మే నెలలో వచ్చే పచ్చడి మామిడికి భారీ డిమాండ్ ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఒక్కో కాయ సైజునుబట్టి రూ.5 నుంచి రూ.7వరకు అమ్ముతున్నారు. వంద కాయలు తీసుకుంటే కాస్త తక్కువ రేటుకు దొరుకుతాయి. మే, జూన్ నెలల్లో మాత్రమే నెల రోజులపాటు తొక్కు మామిడి కాయలు విక్రయిస్తారు. ఈ నేపథ్యంలో మరో పది రోజుల వరకే కాయలు లభిస్తాయి.

కూరలేని లోటు తీరుతుంది



ఎండకాలం, వర్షాకాలంలో కూరగాయలు దొరని సమయంలో ఇంత తొక్కు పెట్టుకొని అన్నంతింటాం. పిల్లలకు పెట్టే స్కూల్ టిఫిన్‌లోకి కారం ఉపయోగపడుతుంది. ఈ కారం ఏడాది పొడువునా నిలువ ఉంటుంది. ఇంటిల్లిపాది ఇష్టంగా తింటాం. కాయలు, కారం ధరలు కొంత ఇబ్బంది పెడుతున్నా తప్పని పరిస్థితులో కొని పచ్చళ్లు సిద్ధం చేసుకోవాల్సిందే.

- పెంజర్ల మల్లారెడ్డి, చేవెళ్ల

ప్రతి సంవత్సరం కొనుగోలు చేస్తాం



ప్రతి సంవత్సరం మామిడికాయ పచ్చడి పెడతాం. మామిడికాయల దిగుబడి ఈఏడాది అధికంగా ఉన్నప్పటికీ రేట్లు మాత్రం ఎక్కువగానే ఉన్నాయి. మార్కెట్‌లో అమ్మే పచ్చళ్ల కంటే ఇంట్లో తయారు చేసుకునే పచ్చళ్లు రుచిగా ఉంటాయి. మనం అన్నీ తగినంత వేసుకొని తయారు చేసుకుంటాం. ఏడాదంతా వాడుకుంటాం.

- దేవుని విజయలక్ష్మి, గృహిణి, చేవెళ్ల

ప్రతీ ఒక్కరిపై దేవతల దీవెనలు ఉండాలి

- మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు

కందుకూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉన్న పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, తల్లుల దీవెనలు ప్రతీ ఒక్కరిపై ఉండాలని, ఈ సంవత్సరం వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడిపంటలు మరింత వృద్ధి చెందాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. లేమూరు గ్రామంలో నిర్వహించిన పోచమ్మ తల్లి ఉత్సవంలో కాంగ్రెస్ శ్రేణులతో ఆదివారం మధ్యాహ్నం పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడారు. గ్రామాలు సస్యశ్యామలంగా ఉన్నప్పుడే దేశం పురోగతి చెందుతుందని, దీనికి గాను ప్రతి గ్రామంలో ఉన్న దేవతామూర్తులకు ఇలాంటి ఉత్సవాలను చేపట్టాలని కోరారు. అమ్మదయ ఉన్నప్పుడే ప్రతి ఒక్కరు అభివృద్ధి చెందుతారని ఆయనన్నారు. ముఖ్యంగా ఈ సంవత్సరం వర్షాలు సంవృద్ధిగా కురువాలని, అప్పుడే అన్ని కులాలకు ప్రజలకు పనులు చేతినిండా దొరుకుతాయన్నారు. అలాగే తమ ప్రభుత్వం హయాంలో నియోజకవర్గ అభివృద్ధిపై కట్టుబడి పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పోచమ్మ ఆలయ ఉత్సవానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులను గ్రామస్తులు, భక్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, నాయకులు కె.రాణాప్రతాప్‌రెడ్డి, హన్మంతరెడ్డి, శ్రీధర్, ఎలుక సుధాకర్‌రెడ్డి, ఇ.జంగయ్య, రాజునాయక్, సత్యనారాయణ, డి.నర్సింహాచారి, భాస్కర్, జి.దేవేందర్, ఐలయ్య, రాకేష్‌గౌడ్, సి.లక్ష్మయ్య, భూపాల్‌రెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి, ఎం.శ్రీకాంత్ రెడ్డి, జి.మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక రంగంలో దేశం ప్రపంచంలో 4వ స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నాయకుడు భద్రేశ్వర్

మర్పల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం ఆర్థిక రంగంలో ప్రపంచంలో నాలుగో స్థానానికి ఎగబాకిందని బీజేపీ జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం 11సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. అభివృద్ధి, క్రీడారంగం, వ్యవసాయం, రక్షణ రంగానికి అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు. ఉగ్రవాదులను తుదముట్టిస్తూ, మావోయిస్టులు లేని దేశంగా అడుగులు వేస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్,నాగన్న, శ్రీమంత్‌కుమార్, మధుకర్, శ్రీధర్‌రెడ్డి, సురేశ్, సంగమేశ్, గణేశ్, ఆనందం, అమర్‌నాథ్, గోపాల్, శ్రీకాంత్, మధు, రవీందర్ పాల్గొన్నారు.

సీపీఐ మండల మహాసభ విజయవంతం చేద్దాం

చేవెళ్ల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సీపీఐ 16వ మండల మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి తెలిపారు. ఆదివారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ... సీపీఐ మండల 16వ మహాసభ చేవెళ్లలో ఈ నెల 10వ తేదీన నిర్వహిస్తామన్నారు. మహాసభకు పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి మల్లారి సత్తిరెడ్డి, సీపీఐ నాయకులు ప్రభులింగం, సుధాకర్‌గౌడ్, సత్యనారాయణచారి, అంజయ్య, మక్బూల్ ఉన్నారు.



చేవెళ్ల పట్టణంలో మాట్లాడుతున్న నాయకులు


వికారాబాద్: వికారాబాద్ మార్కెట్‌లో చేపల అమ్మకాలు

చేపలకు భలే గిరాకీ

- మృగశిర కార్తె సందర్భంగా జోరుగా చేపల విక్రయాలు
- జనంతో కిక్కిరిసిన మార్కెట్లు
- రూ.600లు పలికిన కిలో కొర్రమీను

వికారాబాద్/పరిగి/ఘట్‌కేసర్/కీసర, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తెను పురస్కరించుకొని వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఆయా మండలాల్లో మార్కెట్ల చేపల విక్రయాలు జోరందుకున్నాయి. వికారాబాద్ జిల్లా కేంద్రంలో చుట్టూ ఉన్న కోట్పల్లి, సర్పన్‌పల్లి జుంటుపల్లి, నందివాగు ప్రాజెక్టుల నుంచి వచ్చిన చేపలను మార్కెట్‌లో అమ్మకానికి పెట్టారు. సాధారణ రోజుల కంటే రూ.50నుంచి రూ.100వరకు అదనంగా విక్రయించారు. ఇందులో రవ్వలు, బంగారు తీగ, కొరమీను, బొచ్చలు అమ్మకానికి ఉంచారు. రవ్వ, బొచ్చ చేపలు కిలో రూ.200పలకగా కొర్రమీను రూ.600లకు అమ్మకాలు చేపట్టారు. వాతావరణంలో మార్పుల వల్ల మృగశిర కార్తె రోజుచేపలు తింటే మంచి దని అనాదిగా వస్తున్న ఆచారం. అందులో భాగంగా ప్రజలు చేపలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపెట్టడం కనిపించింది. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలోని పలుచోట్ల చేపల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పరిగి మార్కెట్‌లో చేపల అమ్మకాలు, కొనుగోళ్లు జోరుగా కొనసాగాయి. కీసరలో రోడ్లపై విక్రయించే వారి వద్ద రద్దీ ఎక్కువగా ఉండటంలో జనాలు ఏకంగా చెరువులు, కుంటల వద్దకు వెళ్లి చేపలను కొనుగోలు చేశారు.


పరిగి మార్కెట్‌లో చేపల విక్రయాలు


ఘట్‌కేసర్‌లో చేపల దుకాణం వద్ద కొనుగోలుదారుల రద్దీ


ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్ వద్ద చేపల విక్రయాలు

కీసర నూర్ మహ్మద్ చెరువు వద్ద చేపలను కొనుగోలు చేస్తున్న జనం →



కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరిక


మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు

దుద్యాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుదురుమళ్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 18మంది ఆదివారం హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మడిగె శ్రీనివాస్, నర్మద కిష్టప్ప, బొజ్జప్ప, వెంకట్రాములు, ఇమ్రాన్, నరేశ్‌గౌడ్, నర్సింహులు, సాయిలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు


ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రామారావు

కీసర రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తుందని కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు ముప్ప రామారావు అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలో ఆదివారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అహ్మద్‌గూడ మాజీ సర్పంచ్ యాదగిరిగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవరెడ్డి, శోభారాణి, దిలీప్‌కుమార్, గోవింద్‌సింగ్, భజరంగీ, ఆనంద్, భరత్, మునీశ్వరి, బాలమణి పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు


ధారూరు హనుమాన్ మందిర్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ధారూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ధారూరు హనుమాన్ ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ఆంజనేయ స్వామికి అభిషేకం, అలంకరణ, హోమం, చందనం పూజలు చేసి హారతినిచ్చి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పూజారి కుమార స్వామి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

యువ వికాసం.. మరింత ఆలస్యం

(ఐదో పేజీ తరువాయి)

వ్యవహరించే జిల్లా స్థాయి కమిటీకి పంపించారు. పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడంతో అర్హుల ఎంపిక అగ్ని పరీక్షగా మారినట్లు తెలుస్తోంది. అర్హుల ఎంపికలో తొలిసారిగా రుణం తీసుకునే వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. దీనికి తోడు సంబంధిత వ్యాపారంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మొత్తం యూనిట్లలో దివ్యాంగులకు 5 శాతం, మహిళలకు 25 శాతం కేటాయించనున్నారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పరిశీలించిన తర్వాతనే అర్హుల తుది జాబితా ఖరారు కానుంది. ముందుగా రూ. 50 వేలు, రూ.లక్ష లోపు రుణాలను మంజూరు చేసి, ఆ తర్వాత దశల వారీగా పథకం లక్ష్యాలను పూర్తి చేయాలని ప్రభుత్వం భావించింది. కాగా, అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తికాక పోవడం, ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడం వల్లనే మంజూరు పత్రాల పంపిణీ ప్రక్రియ వాయిదా పడినట్లు తెలుస్తోంది.

రూ.4 లక్షల రుణం కోసమే ఎక్కువ

ఈ దరఖాస్తుల్లో 35,792 మంది దరఖాస్తుదారులు రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల యూనిట్ల కోసమే దరఖాస్తు చేసుకోవడం విశేషం. రూ.4 లక్షల రుణం తీసుకుంటే అత్యధికంగా రూ.2.80 లక్షల రాయితీ వర్తించనుండడంతో ఎక్కువ మంది ఈ విలువ కలిగిన యూనిట్లను ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఉన్న యూనిట్లకు దరఖాస్తు చేసుకున్న వారు ఆ యూనిట్లకు ఎంపిక కాకపోయినా రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఉన్న యూనిట్లకు ఎంపికయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. రూ.2 లక్షల యూనిట్‌కు దరఖాస్తు చేసుకున్నా వివిధ కారణాలతో ఆ యూనిట్‌కు అర్హత లేకపోయినా అంతకంటే తక్కువ యూనిట్లకు పరిగణనలోకి తీసుకోనున్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు


పార్టీ నాయకులను సన్మానిస్తున్న మల్లేశం

తాండూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంలో 11 సంవత్సరాలు ప్రభుత్వం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం తాండూరు బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, సంబురాలు చేసుకున్నారు. ఆర్టికల్ 370, ట్రిబుల్ తలాక్ రద్దు, రామమందిర నిర్మాణం, కళ్యాణ్ యోజన, ఆయుశ్మాన్ భారత్ వంటి కార్యక్రమాలతో పాటు ఆర్థిక రంగంలో ప్రపంచంలోనే 4వ స్థానం నిలిచిందని నాయకులు కొనియాడారు. 'మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా' పేరుతో కార్యక్రమం నిర్వహించి పార్టీ ముఖ్య కార్యకర్తలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లేశం పాల్గొన్నారు.

గనుల శాఖకు భారీ ఆదాయం

(ఐదో పేజీ తరువాయి)

మండలం పెద్ద నందిగామ మినరల్ బ్లాక్‌కు ఆన్‌లైన్ వేలం నిబంధనల ప్రకారం బిడ్స్ కాకపోవడంతో వాయిదా వేశారు. నిబంధనల ప్రకారం ముగ్గురుకంటే ఎక్కువ మంది బిడ్స్‌ను వేయాల్సి ఉండగా ముగ్గురు మాత్రమే టెండర్ వేశారు. దీంతో సరైన బిడ్స్ రాని కారణంగా వాయిదా వేశారు. ఈ బ్లాక్‌లో స్టోన్ అండ్ మెటల్ మినరల్ ఉంది.

ఆన్‌లైన్ టెండర్ల వివరాలు

బ్లాక్	బిడ్స్	చెల్లింపు (25 శాతం)
గోవిందాపూర్	4,42,94,000	1,10,73,500
మన్‌చన్‌పల్లి	7,73,69,000	1,93,42,250
మీనపల్లికలాన్	46,10,600	11,52,650
మొత్తం	**12,62,73,600**	**3,15,68,400**

ఆరుబయటే సమావేశాలు

- అసంపూర్తిగా మహిళా సమాఖ్య భవనం
- ఇబ్బందులు పడుతున్న సభ్యులు


కులకచర్లలో ఆరుబయట సమావేశమైన మహిళా సంఘం సభ్యులు

కులకచర్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సమాఖ్య భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో ఆరుబయట సమావేశాలు నిర్వహించాల్సి వస్తోందని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు. కులకచర్ల గ్రామ మహిళా సమాఖ్యకు గత ఎనిమిది సంవత్సరాల కిందట భవనం మంజూరైంది. ఆ నిర్మాణం కాస్త మధ్యలోనే ఆగిపోయింది. మహిళా సమాఖ్య సభ్యులు ప్రతీ నెల నిర్వహించే సమావేశం ఇలా ఆరుబయటే నిర్వహిస్తున్నారు. వారికి పక్కా భవనం లేక హనుమాన్ దేవాలయం ముందు ఆరుబయట కూర్చొని ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని మహిళలు కోరుతున్నారు.


అసంపూర్తిగా మహిళా సమాఖ్య భవనం

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

దోమ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యాసంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. 21 సంవత్సరాల తర్వాత ఒకేదగ్గర కలుసుకోవడంతో ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనంతో ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుంటూ అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో విద్యాబుద్దులు నేర్పించిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన


దుద్యాల: లగచర్లలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

దుద్యాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన ఉంటుందని ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, అభయ్‌కుమార్, రవి నాయక్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని లగచర్ల గ్రామంలో ఆదివారం పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గ్రామంలో దివ్యాంగురాలు అనూషకు మనోధైర్యం చెప్పారు. చదువుకు అంగవైకల్యం అడ్డుకాదన్నారు. అమ్మాయిని పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులతో కోరారు. పాఠశాలకు వచ్చి పోయేందుకు సీడబ్ల్యూఎస్ ద్వారా ట్రై సైకిల్ అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మనోహర్‌రెడ్డి పూజ, సంతోష పాల్గొన్నారు.

కులకచర్ల: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉంటుందని ప్రధానోపాధ్యాయులు అజ్మతుల్లా, ఆంజనేయులు, కృష్ణయ్య, అజ్మత్, రమేశ్, వేణయ్య, సాయికుమార్, మహేశ్, మాణిక్యం, రాంచంద్రయ్య, కల్పన, భాగ్యమ్మ తదితరులు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా కులకచర్ల మండలంలోని పుట్టపహాడ్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.


కులకచర్ల: పుట్టపహాడ్‌లో బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

రైల్వేగేట్ కష్టాలు తీరేదెన్నడు?


బషీరాబాద్‌లో రైల్వేగేటు వద్ద నిలిచిన వాహనాలు

బషీరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్‌లోని రైల్వేగేట్ వద్ద తరుచూ గేటు పడటంతో వాహనాదారులకు నిత్యం ఇక్కట్లు తప్పడం లేదు. ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలన్నీ గేటు దాటి రావాల్సి ఉండటంతో ప్రజలు, ఉద్యోగులకు ఇబ్బందులు పడుతున్నారు. రైలు వచ్చిన ప్రతీసారి గేటు వేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. రైలు వెళ్లగానే గేట్ తెరిచినప్పుడు ఒకేసారి ఎదురెదురుగా వాహనాలు వస్తుండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఒక్కోసారి వాహనాలు దూసుకువచ్చి ట్రాఫిక్ జాం కావడంతో ముందుకెళ్లే పరిస్థితి ఉండదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆశాఖ ఉన్నతాధికారులు రైల్వేగేట్ కష్టాలు తీర్చాలని మండలవాసులు కోరుతున్నారు.

వివాహ వేడుకలో తిరుపతిరెడ్డి


వివాహాది కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, నాయకులు

దౌల్తాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి వివాహ వేడుకలో పాల్గొన్నారు. యాంకి గ్రామంలో ఆదివారం జరిగిన వివాహ కార్యక్రమానికి పార్టీ నాయకులతో కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్రావ్, ప్రమోద్‌రావు, కోటం రాములు, వీరన్న, వెంకట్రాములు, దస్తప్ప పాల్గొన్నారు.

వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కడం హర్షణీయం

కొడంగల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి దక్కడం హర్షణీయమని ముదిరాజ్ సంఘం నాయకులు కూర వెంకటయ్య, తలారి శేఖర్ తదితరులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించడం సంతోషదాయకమన్నారు. వాకిటి శ్రీహరి గ్రామ సర్పంచ్ నుంచి ప్రజలకు సేవలందిస్తూ మంత్రి పదవి వరకు ఎదగడం గర్వించదగ్గ విషయమన్నారు.

ధారూరు: రాష్ట్ర మంత్రి వర్గంలో ముదిరాజ్‌లకు కాంగ్రెస్ అధిష్టానం అవకాశమివ్వటం హర్షణీయమని ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎల్.అశోక్ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ప్రటికంచిన మంత్రి వర్గంలో వాకిటి శ్రీహరి ముదిరాజుకు స్థానం కల్పించి ముదిరాజ్‌లకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుందని ఆయన అన్నారు. ముదిరాజ్‌లు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుబడుతారని, ముదిరాజ్‌లను గుర్తించి మంత్రి పదవి ఇచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్‌కు ఆయన దన్యవాదాలు తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బషీరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14వ తేదీన జరిగే లోక్ అదాలత్‌ను మండలంలోని కక్షీదారులు సద్వినియోగం చేసుకోవాలని బషీరాబాద్ ఎస్‌ఐ పి.శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా చిన్న, చిన్న కేసులు, పరస్పరం కొట్టుకున్నవి, చోరీలు, చీటింగ్ కేసులు, భార్యాభర్తల గొడవలు, రోడ్డు ప్రమాదాలు, భూములకు సంబంధించిన తగాదాలు వంటివి లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ లోక్‌అదాలత్‌లో పాల్గొని పరస్పర అంగీకారంతో కేసులు మాఫీ చేసుకునే అవకాశం ఉందన్నారు.

సాయిగీత ఆశ్రమంలో వైద్య శిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్యులు

మేడ్చల్‌టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సాయిగీత ఆశ్రమంలో ఆదివారం ఉచిత అస్తమా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి సుమారు వెయ్యి మంది అస్తమా వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

గుండ్లపోచంపల్లిలో వెలగని వీధిదీపాలు


వెలగని వీధి దీపం

మేడ్చల్ టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని పలు వీధుల్లో వీధిదీపాలు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీసీ శ్మశాన వాటిక నుంచి అయోధ్య చౌరస్తా వరకు, రైల్వే గేటు వరకు గత పాలకులు రూ.20లక్షలు వెచ్చించి ఏర్పాటుచేసిన వీధిదీపాలపై ప్రస్తుతం మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని కండ్లకోయ గ్రామ పరిధిలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన దీపాలు వెలగడం లేదని స్థానికులు అంటున్నారు. ఈ విషయమై సంబంధిత మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

- బస్సు షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు
- దుకాణాల ఎదుట నిరీక్షించాల్సిన దుస్థితి
- పట్టించుకోని పాలకులు


బషీరాబాద్: రైల్వే స్టేషన్ వద్ద ప్రధానరోడ్డుపై బస్సెక్కుతున్న ప్రయాణికులు



చౌడాపూర్: వర్షంలో వ్యాపార సముదాయాల ఎదుట నిలబడిన ప్రయాణికులు(ఫైల్)

బషీరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. చాలా చోట్ల ప్రయాణ ప్రాంగణాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ బస్సు కోసం నిరీక్షించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. చెట్ల కింద, దుకాణాల ముందు వేచి చూస్తున్నారు. బషీరాబాద్‌లో 30ఏళ్ల కిందట నిర్మించిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. బస్సుల రాకపోకలకు బస్టాండ్ అనుకూలంగా లేకపోవడంతో మరుగున పడింది. ప్రస్తుతం బస్టాండ్ శిథిలావస్థలో ఉంది. దీంతో స్థానిక రైల్వేస్టేషన్ కూడలిలోని చెట్టు కింద విద్యార్థులు, ప్రయాణికులు నిలబడి బస్సుల కోసం వేచిచూస్తున్నారు. గ్రామాల్లో అక్కడక్కడా బస్సుషెల్టర్లు ఉన్నప్పటికీ వాడుకలో లేవు. దీంతో ప్రధాన రోడ్లపై గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్సు షెల్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


బషీరాబాద్‌లో నిరుపయోగంగా బస్టాండ్

చౌడాపూర్: మండలంలో మొత్తం 14 గ్రామాలు, ఎనిమిది తండాలు ఉన్నాయి. ఆయా గ్రామాలు, తండాల నుంచి మండల కేంద్రానికి వచ్చిపోయే ప్రజలు ఎండకు, వానకు దుకాణ సముదాయాల ముందు బస్సుల కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. మండల కేంద్రంలో నుంచి నవాబుపేట్, కులకచర్ల, చౌదరిగూడెంతో పాటు చౌడాపూర్ మండలంలోని అన్ని గ్రామాలకు ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. మండల ఏర్పడినా బస్టాండ్ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా బస్టాండ్ ఏర్పాటుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మండలముగా ఏర్పడినా బస్టాండ్ లేదు



చౌడాపూర్ నూతన మండలముగా ఏర్పడి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు బస్టాండ్ ఏర్పాటు చేయలేదు. దీంతో మండల కేంద్రానికి వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు ప్రతీ నిత్యం దుకాణాసముదాయాలు, హోటళ్ల దగ్గర బస్సుల కోసం వేచి ఉంటూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

\- బందెయ్య, బీజేపీ నాయకుడు

ఉచితంగా నోట్‌పుస్తకాల పంపిణీ


నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

పరిగి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు అన్ని రకాలుగా చేయూతను అందిస్తామని రంగాపూర్ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. సాయిసేవా సమితి ఆధ్వర్యంలో గత నెల రోజులుగా స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ పొందిన 50మంది విద్యార్థులకు ధ్రువపత్రాలు, ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు.

క్రైం కార్నర్

కట్టేసి.. కబేళానికి తరలిస్తుండగా..


బీజేపీ కార్యకర్తలు రక్షించిన ఎద్దు

చౌడాపూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కబేళానికి తరలిస్తున్న ఎద్దును బీజేపీ కార్యకర్తలు రక్షించారు. మండల కేంద్రంలో అక్రమంగా ఎద్దును ఆదివారం కబేళానికి తరలిస్తుండగా విషయాన్ని తెలుసుకున్న బీజేపీ కార్యకర్తలు అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఎద్దును రైతుకు అప్పగించారు.